

మంచివాడు – అతిచెడ్డ వాళ్ళందర్లాగానే – పుట్టగానే ఏడ్చేడు. చిన్నప్పుడు అమ్మ కేకలేస్తే ఏడ్చేడు. పక్కింటి పిల్లడు కొడితే ఏడ్చేడు. దెబ్బ తగిలే, నొప్పిపుడితే "అమ్మా! హమ్మా!" అంటూ ఏడ్చేడు.

చెడ్డవాళ్ళు దొంగఏడుపులు కూడా ఏడ్చేరు. మంచివాడు అలా చెయ్యలేక, కొంతగా "చిన్నప్పుడే చెడిపోయేడు వెధవ!"

బళ్ళో చేరగానే మంచివాడి పలక విరగ్గొట్టేరు, అతనికి బూతుపేరు పెట్టారు. అతని పాంటుచొక్కాని చింపేరు, కొత్త చొక్కామీద కరక్కాయసిరా ఒలకబోసేరు. కొన్నాళ్ళయాక ఆటల్లో అతన్ని డొక్కలో తన్నేరు. పక్కలు పొడిచేరు, మండీకొట్టి మడమసీలమీద తన్ని, అతనికాళ్ళు విరగ్గొట్టబోయేరు. మంచి ఆటల టీములోకి అతన్ని రాకుండా చేసేరు. పెద్దయాక అతను తెచ్చుకున్న టెక్స్టుబుక్కులు లపువు తీసుకుపోయేరు, అతను రాసుకున్న నోట్సు ఎత్తుకుపోయేరు, అతను చదువుకునే సమయంలో డిస్టర్బ్ చేసేరు, అతను పడుకున్నప్పుడు వాళ్ళంతా చదువుకున్నారు, ఆఖర్న, పరీక్షలో అతను రాసిన జవాబులన్నీ కాపీలు కొట్టేరు.

మంచివాడు పరీక్షలు పాసయేక, మంచి ఉద్యోగానికి అర్జీపెట్టి వెళ్తే అధికార్లు అతణ్ని ఎగాదిగా చూసేరు. అని

గోల్కొండ రాంప్రసాద్

ప్రశ్నలూ వేసేరు, కొంతసేపు ఆలోచించేరు. నీకు పర్సనాలిటి లేదు పొమ్మన్నారు.

మంచివాడు తిరిగీ తిరిగీ ఒక చిన్న నౌఖరీలో కుదురుకొంటే, అతణ్ని ఆఫీసరొకసారి మెచ్చుకున్నాడన్నెప్పి హెడ్ గుమాస్తా కసురుకున్నాడు, పని పెటుకొని మంచివాడిచేత అరవచాకిరీ చేయించుకున్నాడు.

ఆఫీసులో పెద్దలూ పిన్నలూ అంతా కలిసి, మంచివాణ్ని, కనీసం చిల్లరచిల్లర లంచాలైనా తినమన్నారు; అతను తిననంటే, వెక్కిరించేరు. వెర్రిపీరన్నారు, కక్ష గట్టేరు, తంటాలు తెచ్చేరు. అతణ్ని ఊరూరా తిప్పేరు. ఏ సీటుకీ పనికిరాడన్నారు, ఎందుకూ కొరగానివాడన్నారు.

మంచివాడికి చాలా కాలం వరకూ పెళ్ళి కాలేదు.

"అంత మంచివాడికి పిల్లనిస్తారే అనుకోండి ; కాని, వాడి దినవెచ్చం తీర్చుకోలేనివాడు దాని దినం ఎలా తీర్చగలడు?!"

అంటూ చాలామంది పెదవులు విరిచేసుకున్నారు.

చివరకొక మంచి ముహూర్తాన మంచివాడు ఓ అరమనిషి పైజగల ఆడమనిషికి పుస్తెగట్టి ఆనందబాష్పాలు రాల్చేడు. ఆమె నతను ప్రేమించేడు. ఇవ్వగలిగినంత సుఖ మామెకి ఇచ్చేడు.

ఆవిడ కాపరాని కొచ్చేక, పక్కింటికి వెళ్ళి అక్కడి కోడలి నగలుచూసి కిలకిల్లాడి, ఇంటికొచ్చి విలవిల్లాడిపోయింది. ఎదటింటి అడబడుచు కోకలు చూసి మురిసిపోయి ఇంటికొచ్చి గింజుకుపోయింది. తనభర్త చవటపెద్దమ్మనే నిశ్చయాని కొచ్చింది. టాపు తీసి కార్లో షికారూ, అద్దాలమేడల్లో కాపురాలూ, నిలువుటద్దాలముందు ముస్తాబులూ, దన్నప్పరుపులమీది సుఖాలూ తల్చుకొని ఆమె తహతహ లాడిపోయింది.

చివర కావిడ బక్కీసుల్తో బలిసిన ఆఫీసు బంట్రోతు కుర్రాడే తన పెనిమిటికంటె చలాకీగా ఉన్నాడనే నమ్మకానికి వచ్చింది. ఓ రోజున ఆవిడ ఓ స్టూడెంట్ కుర్రాడికి బట్టలిచ్చిన సొగసూ జోడిచ్చిన పొడవూ చూసి మురిసిపోయింది. ఆ తరవాత ఒక సాయబుగారి మెహర్బానీ చూసి మోజుపడింది. ఒక పొయట్ గారి కాళ్ళూ కనుబొమ్మలూ చూసి మోహపడి భ్రాంతిపడింది. చివర కొక – షావుకారి గారి డబ్బు చూసి మోహపడిపోయింది.

మంచివాడికి అన్ని రహస్యాలూ తెలిసివచ్చిన తరువాత, అందుగురించి ఏం చెయ్యాలో తెలియక, మనసు కమిలిపోగా కుమిలి కుమిలి ఏడ్చి, చీకట్లో దేవుణ్ణి ప్రార్థించి ప్రార్థించి, నొప్పితో కనురెప్పలు మూసుకుపోగా ఎలాగైతేనేం నిద్రపోయేడు.

అప్పు డా మంచివాడికి భగవంతుడు, కలలో, దివ్యసుందర విగ్రహంతో కనిపించి, నాలుగు చేతుల్తోనూ ఆ మంచివాణ్ని మృదువుగా నిమిరి, కరుణాకటాక్ష వీక్షణాన్ని అతనిపై కురిపించి, మృదు మధురహాస్యంతో అతణ్ని ముద్దుగా మురిపించి, "ఈ తరవాత రాబోయే నీ ఆరువందల రెండో జన్మలో నీకు మేలు కలుగుతుంది. అందాకా కాస్త ఓపికపట్టు నాయనా!" అని చెప్పి అతని కలలోంచి నిద్రలోంచి జారుకున్నాడు.

అప్పుడు మంచివాడు నిద్రలో నిట్టూర్చిన నిట్టూర్పు ఆ జారుకున్న దేవుణ్ని వెతకడానికి వెళ్ళి దారి కనిపించక గాల్లో కలిసిపోయింది.

మర్నాడు మంచివాడు బాధని దిగమింగుకొని దాన్ని అరిగించుకోలేక పైకి కక్కలేక, మెల్లిగా నడుచుకొంటూ ఆఫీసుకి వెళ్తే ఆఫీసు డిప్యూటీ అతన్ని గంటసేపు తిట్టేడు. గంటపైని నాలుగో నిమిషందాకా తిట్లు తిన్నాక మంచివాడికి అలకొచ్చిమంచికోపం(మంచివాడికోపం) వచ్చింది. దాన్తో ఆఫీసులో అంతా అతన్ని "తిరుగుబోతు"వన్నారు. ఛార్జీలు ఫ్రేం

చేసేరు, ఎంక్వయిరీ జరిపించేరు, వార్నింగిచ్చేరు.

అలాగ నాలుగైదు ఎంక్వయిరీలు జరిపించేక మంచివాణ్ని ఉద్యోగంలోంచి డిస్మిస్ చేసేరు.

మంచివాడి స్నేహితులు "నీ కోపమే నీ కొంప ముంచిం" దన్నారు. విరోధస్తులు "పొగరుబోతు వెధవకి ప్రాయశ్చిత్తం జరిగిం"దన్నారు. చాలామంది 'అతనికిశౌర్యం లా'వన్నారు. చుట్టా లంతా అతణ్ని "నీ బతు కేదో నువ్వు బతుకు, బతకలేకపోతే నీ ఇష్టం ఒచ్చింది చేసుకో। కాని, మమ్మల్ని మాత్రం — నీకు పుణ్యంఉంటుంది—చంప!"క న్నారు.

అతనిభార్య అతణ్ని షావుకారిగారి కొట్లో గుమాస్తాగా చేరి తుక్కలాపడుండమంది.

మంచివాడు నీచానికి దిగలే నన్నాడు, చెడ్డపని చెయ్యలే నన్నాడు.

"నువ్వెందుకూ పనికిరావు. మరి ఎలా? ఏ యేట్లోపడిచస్తావో చావు!'' అని అంతా అతనికి ఉచితంగా సలహా ఇచ్చేరు.

మంచివాడు పళ్ళు కొరికేడు, జుట్టు పీక్కున్నాడు. కడుపు మాడగా, కళ్ళు మండగా, కాళ్ళు పీకగా, గాలి పీలుస్తూ, నీరు తాగుతూ, ఎండ తింటూ, ఊరంతా తిరిగి తిరిగి అంధకారంలో మునిగేడు.

ఊరవతల అర్ధరాత్రి చీకట్లో కొండ వార బండరాతిమీద కూర్చొని మంచి

వాడు, "నే నేం చెయ్యడం???" అంటూ గావుకేకలు వేసి దేవుణ్ని ప్రశ్నించేడు. దేవుడు పలకలేదు. బండరాయిపక్క కొండమాత్రం "డం???" "డం???" అంటూ ప్రతిధ్వనించింది. అది విని విని మంచివాడు పెర్రిగా నవ్వేడు.

ఆఖరికి ఆక్కణ్నించి లేచి చీక ట్లోంచి, కాట్లోంచి, రోడ్డుమీంచి ఊళ్లోకి వచ్చి అందర్నీ సలహా లడిగేడు. కొంత మంది నవ్వేరు, కొంతమంది నిట్టూర్చేరు.

మరో నౌఖరీ చూసుకోకూడదా?

దొరకదు దొరకదనీ ఫోపొమ్మనీ అంతా గెంటేశారు. షాహుకారుకూడా "ఉంపుడుగత్తె పక్కలో ఉంటే పక్కనే మొగు డెందుకు?'' అనుకున్నాడు. అంతాకూడా, తిక్కవెధవలూ తిరుగుబోతు వెధవలూ చాకచక్యం లేని వెధవలూ మా కక్కర్లేదు పొమ్మన్నారు.

కిళ్లీకొట్టు పెడితేనో?

పెట్టలేవు. పెట్టినా నడపలేవు. నీకు కిళ్లీలు చుట్టడంఅయినా రాదు. వచ్చినా నీ పాపంతా అరువుగాళ్ళు తినేస్తారు.

కిరాణాకొట్టు ఓపెన్ చేస్తేనో?

నీకు మదుపులేదు, చురుకులేదు. తప్పు తూనిక లూపలేవు. దొంగసరుకు అమ్మలేవు, చిల్లర ఆఫీసర్లకి లంచా లివ్వలేవు, తీగవాళ్ళకి అరు వివ్వకుండా ఉండలేవు, లాభా లియ్యలేవు.

మరేదైనా వ్యాపారం?

నువ్వే వ్యాపారానికీ పనికిరావు. మదుపుండాలి, మాయుండాలి, రెండూ లేవు నీదగ్గర.

రిక్షా లాగితేనో?

లాగలేవు. లాగినా రెండేళ్ళల్లో గుండె ఆగి చస్తావు.

వ్యవసాయం?

భూఁ వెవ డిస్తాడు?!

చాకలిపని? బారికపని?

నువ్వాఖరికి మంగలి పనిక్కూడా పనికిరావు. బుర్ర గొరగడం కూడా ఆనెస్ట్‌గా గొరుగుతా నంటావు. బుర్ర దగ్గర నయాపైస కిట్టదు అలాగైతే. అయినా, మాయగాళ్ళు లక్షమం దుండగా నీ చేత ఎవడు గీయించుకుంటాడు బుర్ర?! నీకు ఆ ఛాన్సేలేదు.

మరైతే నే నెందుకు పనికొస్తాను?

నువ్వెందుకూ పనికిరావు, దొరపని (అంటే దొంగపనే అనుకో) ఆ పనికీ పనికిరావు. అసలైన దొంగపనికి అసలే పనికిరావు –

అన్నా రంతాను.

సాయంకాలం ఏడయింది.

మంచివాడికి ఏడుపొచ్చింది.

"మరైతే నేను చావడానికితప్ప మరి ఎందుకూ పనికిరానా?!" అంటూ అతను సముద్రంవైపు పరిగెట్టేడు. అక్కడ వడ్డున నిశ్చేష్టుడయి నిలబడిపోయేడు.

చీకట్లో సముద్రపు కెరటాలు "నువ్వు చావుకి" అంటూ పైకి లేచి, "ఫ్రన్కిరావ్" అంటూ గభీమని విరిగి "నువ్వు చావనూరావూ లేవుస్మా!'' అనే అర్థంతో మాటల్ని విరిచి విరిచి ఆతనికి నువ్వ



ష్టంగా తెలిసేట్టుగా అరిచిఅరిచి చెప్పేయి.

రాత్రంతాచీకటిగాబాధలపుట్టలాఉంది.

రాత్రంతా చీకటిగా రాక్షసబొగ్గుల గనిలా ఉంది. తెల్లవారింది.

నిప్పుకవ్వలా ఇనుడు ఉదయించేడు. నీళ్ళల్లోంచి నిప్పుల చక్రంలా బైటికి పూర్తిగా లేచేడు.

సముద్రానికీ కొండకీ మధ్య ఇసకలో నిల్చొనే ఉన్నాడు మంచివాడు.

చీకటంతా బెదిరి చెదిరిపోయింది. ఆకాశంలో మబ్బులు తూలి తూలి పోయేయి. తెలి వొచ్చిన చల్లగాలి వీచి వీచి పోతోంది. సముద్రపు కెరటాల తురాయి లన్నీ రంగురంగుల రంగుల్తో పైకి పైకి లేచేయి.

అంతలో భూమి అదిరింది. ఎక్కణ్నించో కోటిగొంతుల పాట వినిపించింది.

చప్పుడు విని తిరిగిచూసేడు మంచివాడు.

వాళ్ళ ముఖా లన్నీ ఉదయకిరణాల్లో వింతశోభతో మెరుస్తున్నాయి. ముందుకి సాగే సేనల ఎగిరే జెండాల్లా ఉన్నారు వాళ్ళు. వాళ్ళ భుజాలమీద మాత్రం బరువైన బండరాళ్ళు తీరిగ్గా అమిరున్నాయి. వాళ్ళంతా దేవుడి దండులా ఉన్నారు.

''ఎవరు మీరు? ఎక్కడికి వెళ్తున్నారు?'' అని ప్రశ్నించేడు మంచివాడు.

''మమ్మల్ని 'రాయిమడుసు' లంటారు. మేం మంచిలోకాన్ని నిర్మించడానికి వెళ్తున్నాం'' అన్నారు వాళ్ళు

మంచివాడి కళ్ళంట ముత్యాల బిందువులు రాలేయి. అతను అతి నిర్మలంగా నవ్వేడు. వెంటనే జీవితం అనే బండరాయి తీసి భుజాన వేసుకొని పాటతో పాటు అతను అటువైపు నడిచాడు.